ఆగి వున్న లారీ ఢీకొన్న మరో లారీ

- ఇద్దరు మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి మొగిలి ఘాట్ వద్ద బుధవారం తెల్లవారుజామున బుధవారం తెల్లవారుజాము జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మరమ్మత్తులకు గురైన ఓ లారీ రహదారి ప్రక్కన ఆగి వుండగా మరో లారీ ఆగి వున్న లారీని వెనుక వైపున అతి వేగంగా ఢీకొంది. ఈ సంఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అతివేగంగా లారీ ఢీకొనడంతో ఆగి వున్న లారీ నందు మంటలు చెలరేగి లారీ పూర్తిగా దగ్గమైంది. వివరాలిలా వున్నాయి. వి.కోట నుండి భద్రచాలంకు కట్టెల లోడు తీసుకొచ్చిన లారీ మరమ్మత్తులకు లోనై రహదారి ప్రక్కన డ్రైవర్ లారీని నిలిపివేశాడు. బెంగళూరు నుండి మొగలి శ్రీని ఫుడ్ ఫ్యాక్టరీకి చక్కెర లోడు తీసుకువస్తున్న మరో లారీ ఆగి వున్న కట్టెల లోడ్డు లారీని అతివేగంగా ఢీకొంది. మరమ్మత్తుకు లోనైన లారీ వెనుకవైపున తూర్పుగోదావరి జిల్లా గొల్లగూడెంకు చెందిన డ్రైవర్ రామరాజు(40), క్లీనర్ నాగయ్య(58)లు నిద్రిస్తున్న సమయంలో వారి లారీ అగ్నికి దగ్ధం

మొగిలి ఘాట్‌లో దగ్ధమవుతున్న కట్టెల లోడ్డు లారీ

కావడంతో డ్రైవర్ పూర్తిగా దగ్ధమై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. క్లీనర్ నాగయ్య గాయాలతో బయటపడ్డారు. మరో చక్కెర లోడ్డుతో వస్తున్న లారీ డ్రైవర్ నల్గొండ జిల్లా మిర్యాలగూడెంకు చెందిన సాయికృష్ణ గాయాలతో బయటపడగా మరో డ్రైవర్ వరంగల్‌కు చెందిన యాదయ్య(45) సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే బంగారుపాళ్యం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు సంఘనా స్థలం చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పలమనేరు అగ్నిమాపక వాహనాలు మొగిలి ఘాట్‌కు చేరుకుని దగ్ధమవుతున్న లారీలోని మంటలను అదుపు చేశారు. రహదారిపై సుమారు ఒక గంట పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ మేరకు ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

టెన్షన్...టెన్షన్ !

-తిరుపతిలో నేడు ఏం జరగనుందో!
-జగన్ డిక్లరేషన్‌పై అధికార కూటమి నేతల పట్టు

ప్రభాతవార్త-తిరుపతి: ప్రశాంత తిరుపతి నగరంలో శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం వరకు ఏం జరగబోతోంది!?...నగరంలో ముందస్తుగా తిరుపతి జిల్లా పోలీసులు సెక్షన్ 30 పోలీస్‌యాక్ట్ అమలులో ఉందని ప్రకటించారు. ఈ ప్రకటనతో అటు వైసిపి శ్రేణులు ఇటు అధికార ఎన్‌డిఎ కూటమి నేతలు ఎలా స్పందించనున్నారనేది సర్వత్రా ఉత్కంఠగా మారింది. హిందువులు అత్యంత భక్తితో ,విశ్వాసంతో నమ్మికొలిచే శ్రీవేంకటేశ్వరస్వామి పవిత్ర లడ్డూప్రసాదం తయారీలో జంతువుల కొవ్వునూనె కల్తీచేసి నెయ్యి వినియోగించారనే వివాదం పెద్ద దుమారాన్ని రేపిన విషయం విదితమే. ఈ అంశంలో అధికార ఎన్‌డిఎ నేతలు గత వైసిపి ప్రభుత్వ తీరుతో, మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ,ఆ పార్టీ నేతలకు నమ్మకం లేకనే కమీషన్లకు కల్తీనెయ్యి సరఫరా చేశారనేది పెద్ద ఆరోపణ. అంతేగాక గత టిటిడి బోర్డు ఛైర్మన్లు జగన్‌కు దగ్గర కుటుంబంగా ఉండటంతో ఈ దుమారం ఆగడం లేదు. కల్తీనెయ్యి దేవుడితో ఆటలు అంటూ జనంలో విశ్వాసం లేకపోతోందనే అపవాదుతో జగన్ నేడు తిరుమలకు వస్తుండటంఇప్పుడు టెన్షన్‌కు కారణమైంది. జగన్ అన్యమతస్థుడని అధికార ఎన్‌డిఎ కూటమి పార్టీలు టిడిపి, జనసేన,బిజెపి నేతలు పేర్కొంటూ ఆయన రాకపై ట్విస్ట్ పెట్టారు. శ్రీవేంకటేశ్వరస్వామిపై విశ్వాసం ఉందని జగన్ డిక్లరేషన్ ఇచ్చిన తరువాతే ముందుకు కదలాలని డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే అడ్డుకుంటామని హెచ్చరించారు. దీంతో నేడు తిరుపతి,తిరుమలలో జగన్ పర్యటన సమయంలో మొత్తంగా ఏం జరగనుందనేది ఇప్పుడు అందరినీ ఉత్కంఠగా మార్చింది. అయితే వైసిపి శ్రేణులు మాత్రం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హిందువులేనని, ముఖ్యమంత్రులుగా ఉన్నసమయంలో శ్రీవారి దర్శనానికి, బ్రహ్మోత్సవాల్లో పట్టువస్త్రాలు సమర్పించేందుకు ఆలయంలోనికి వచ్చారని చెబుతున్నారు. టిటిడి అధికారులు కూడా డిక్లరేషన్ తీసుకున్న తరువాతే జగన్‌ను ఆలయంలో నికి అనుమతించాలని ఎన్‌డిఎ కూటమి పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు. మరీ ఈ వివాదం నేడు ఎక్కడకు దారితీయనుందనేది చూడాల్సిందే. ఇప్పుడు సెక్షన్ 30పోలీసు యాక్టు అమలు ప్రశాంతతకు దోహదపడుతుందనేది టెన్షనే.

శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా...

జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు

- జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈ నెల 25వ తేది నుంచి అక్టోబర్ 24వ తేది వరకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని తిరుపతి జిల్లా ఎస్పి సుబ్బరాయుడు తెలిపారు. ఏదైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేయాలంటే ముందస్తుగా లిఖితపూర్వకంగా పోలీసు వారికి అర్జీ ఇచ్చి వారి నుండి అనుమతి తీసుకోవాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు, సమావేశాలు మొదలగునవి నిర్వహించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ పార్టీ నాయకులు, సంస్థలు, వివిధ సముహాలు, ప్రజలు పోలీస్ వారికి సహకరించాలని జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు విజ్ఞప్తి చేశారు.

గణనాధునికి దుర్గగుడి తరపున పట్టువస్త్రసాల సమర్పణ

పట్టువస్త్రాలను తీసుకువస్తున్న దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం అధికారులు

కాణిపాకం, సెప్టెంబర్ 26 ప్రభాత వార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం సిద్ధి, బుద్ధి సమేత గణనాధులకు విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం తరపున నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పలు ప్రముఖ ఆలయాల నుండి స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం తరపున ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్, ఏఈఓ బి.వెంకటరెడ్డి, అర్చకులు గురువారం ఉదయం కాణిపాకం చేరుకుని కాణిపాకం ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్‌తో కలసి పట్టువస్త్రాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. వారికి రాజగోపురం వద్ద ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలను స్వామివారి ఎదుట వుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి వేదమండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. అలాగే దుర్గమ్మ దేవస్థానం తరపున కాణిపాకం ఆలయ ఈఓ గురుప్రసాద్, ఏఈఓలకు దుర్గగుడి ఆలయ ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, హరి మాధవరెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, దుర్గమ్మ దేవస్థానం, సిబ్బంది, అర్చకులు, వేదపండితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఆలయ ఈఓకు ఆహ్వానం

విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగనున్న అమ్మవారి దసరా ఉత్సవాలకు రావాలని ఆహ్వానిస్తూ కాణిపాకం ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్‌కు దుర్గగుడి ఆలయ అధికారులు ఆహ్వానపత్రికను అందజేశారు. స్వామివారి బ్రహోత్మత్సవాల్లో భాగంగా గురువారం జరిగిన పూలంగసేవ సందర్భంగా దుర్గగుడి తరపున పట్టు వస్త్రాలను తీసుకువచ్చి సమర్పించిన అనంతరం ఈఓకు ఆహ్వాన పత్రికను అందజేశారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికే గోకులం షెడ్ల నిర్మాణం : కలెక్టర్

- క్షేత్రస్థాయిలో బిందుసేద్యం పరికరాలు అందించాలి!

కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : పాడి పరిశ్రమను బలోపేతం చేసే లక్ష్యంగా మంజూరు చేసిన గోకులం షెడ్ల నిర్మాణాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక మండల కార్యాలయంలో గోకులంషెడ్ల నిర్మాణం, బిందు సేద్యం పరికరాల పంపిణీకి సంబంధించి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు మేలు చేసేందుకు పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. కుప్పం నియోజకవర్గానికి 503 గోకులం షెడ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వీటి ప్రతిపాదనలు టెక్నికల్ అసిస్టెంట్లు వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వివిఎలు టెక్నికల్ అసిస్టెంట్లు సిద్ధం చేసే ప్రతిపాదనలపై, బిల్లుల అప్‌లోడింగ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. డ్వామా, పశుసంవర్ధకశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాల న్నారు. షెడ్ల నిర్మాణాన్ని జియో ట్యాగింగ్ చేసి ఐడి క్రియేట్ చేయాలన్నారు. తొంభైశాతం రాయితీతో చేపట్టే షెడ్ల నిర్మాణంను రైతులు త్వరగా పూర్తి చేసేలా చూడాలన్నారు. అలాగే కుప్పం నియోజకవర్గంలో 3600హెక్టార్లలో బిందు తుంపర్ల సూద్య పరికరాలు పంపిణీకి రైతుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేసి పరికరాలు అందించాలన్నారు. అర్హత కలిగిన రైతులు తప్పక రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన, పట్టుశాఖ సహాయకులు రైతులకు అవగాహన కల్పించి వందశాతం రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, ఎపిఎంఐపి పిడి బాలసుబ్రమణ్యం, ఎడిలుకోటేశ్వరరావు, అన్నపూర్ణలు పాల్గొన్నారు.

565మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ : కుప్పం నియోజకవర్గంలో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గుర్తించిన 565మందికి ప్రభుత్వం తరపున ఉచితంగా జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌లు ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులురాజు, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కౌన్సిలర్లు సోమశేఖర్, జాకీర్, జనసేన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండుగగా పోలేరమ్మ జాతర

-అమ్మవారిని దర్శించుకున్న లక్షల మంది భక్తులు

అమ్మవారి విశ్వరూప దర్శనం, ఊరేగింపులో పాల్గొన్న భక్త జనం

వెంకటగిరి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : వెంకటగిరి గ్రామశక్తి స్వరూపిణి పోలేరమ్మ అమ్మవారి జాతర గురువారం కన్నుల పండుగగా ముగిసింది. అమ్మవారిని లక్షలాది మంది భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి సంవత్సరం జాతరకు భక్తులు పెరుగుతూ వస్తున్నారు. పోలేరమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు కట్టుదిట్ట మైన చర్యలు చేపట్టారు. దేవదాయశాఖ అధికారులు భక్తులకు ఇబ్బందులు లేకుండా విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. బుధవారం సాయంత్రం పోలేరమ్మ అమ్మవారు ఇల్లుగా పిలిచే కుమ్మరివీధిలో అమ్మవారిని పుట్టమట్టితో తయారు చేసి అమ్మవారిని ఇక్కడ కళ్ళు పెట్టకుండా రూపాన్ని మాత్రం తయారు చేశారు. బుధవారం రాత్రి 11 గంటలకు కుమ్మరవీధి నుండి అత్తవారిల్లుగా భావించే జీనుగుల వీధిలోని అలంకారం మండపానికి తీసుకెళ్లి అమ్మవారికి కళ్ళు పెట్టారు. అమ్మవారిని బంగారు నగలుతో అలంకరించి కనుబొమ్మలను ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనార్థం జీనుగులవారి వీధి నుండి బజారు వీధిలోని గుడి వద్దకు రథంపై తీసుకొని వచ్చి ఉంచారు. గురువారం సాయంత్రం వరకు అమ్మవారిని భక్తులు దర్శించుకున్న అనంతరం నిరూపణకు రథంపై ఊరేగించుకుంటూ తీసుకొని వెళ్ళి మల్లమ్మ గుడి వీధిలోని నిరూపణ మండపంలో అమ్మవారి విగ్రహాన్ని ఉంచి గురువారం రాత్రి తునాతనకలుగా చేశారు. అమ్మవారిని ఊరేగింపులో లక్షల మంది పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

పోలేరమ్మ వారి జాతర సందర్భంగా ఇతర దేశాల్లో స్థిరపడిన వారు కూడా వచ్చి దర్శనం చేసుకుని బ్రహ్మోత్సవంలో బంగారు కిరీటం, బంగారు పాదాలను అలంకరించారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామరాయణరెడ్డి, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రశాంతిరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, చింతమనేని ప్రభాకర్, వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి మాజీ ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ భానుప్రియ దర్శించుకున్నారు.

ఎస్ఆర్ పురం మండలంలో అసలు ఏం జరుగుతుంది!

- అక్రమ క్వారీ నిర్వాహకులపై చర్యలు లేవా! - తాజాగా మరో అక్రమ గ్రానైట్ లారీని సీజ్ చేసిన పోలీసులు

అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్న లారీని పట్టుకున్న పోలీసులు

చిత్తూరు,శ్రీరంగరాజపురం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: శ్రీరంగరాజ పురం మండల పరిధిలో భూగర్భ గనుల దోపిడి యధేచ్ఛగా జరుగుతున్నప్పటికీ ఇటు పై స్థాయి నుండి కింది స్థాయి అధికారుల వరకు ఎవరు పట్టించుకోవడం లేదు. మండల పరిధిలో గ్రానైట్ అక్రమ రవాణాను అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు యధేచ్ఛ గా గ్రానైట్‌ను మండల నుండి ఇతర ప్రాంతాలకు దర్జాగా తీసుకెళ్ళి పోతున్నారు. ఈ పనులతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతున్నప్పటికీ అధికారులు సరైన రీతిలో స్పందించడం లేదని ఆరోపణలు మిన్నంటుతున్నాయి. శ్రీరంగరాజపురం మండలం పద్మాపురం పంచాయతీ దుర్గరాజపురంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా క్వారీ తవ్వకాలు యధేచ్ఛగా జరుగుతున్నాయని 'ప్రభాతవార్త'లో ప్రచురితమైన విషయం విదితమే. ఈ విషయంపై తహసిల్దారు వివరణ కోరితే పద్మాపురం దుర్గరాజపురం క్వారీ తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేదని స్పష్టం చేశారు. అయితే ఈ విషయంపై రెవెన్యూ అధికారులు, భూగర్భ గనుల శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తే ఉన్నత అధికారుల నుండి ఎదైనా ఆదేశాలు వస్తే మాత్రమే తాము వెళ్ళి సీజ్ చేస్తామని తహసిల్దారు నిర్మొహమాటంగా పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో గురువారం ఎస్ఆర్ పురం ఎస్ఐ సుమన్ మండల పరిధిలోని కటికపల్లి పంచాయతీ మంగుంట సమీపంలో అక్రమంగా చిత్తూరు వైపుకు గ్రానైట్‌ను తరలిస్తున్న ఒక లారీని కొత్తపల్లిమిట్ట వద్ద పట్టుకున్నారు. ఈ గ్రానైట్ తరలింపుకు సంబంధించి లారీ డ్రైవర్ వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని గ్రానైట్ లారీని సీజ్ చేశారు. జిల్లాలో నూతన ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుండి క్వారీ నిర్వహకులు అత్యధికులకు ఇప్పటి వరకు అనుమతి జారీ చేయలేదు. అయినప్పటికీ కొంతమంది అధికార పార్టీ నాయకులను తమ గుప్పిట్లో పెట్టుకుని ఎలాంటి అనుమతులు లేకుండా క్వారీలను నిర్వహిస్తున్నారు. ఎస్ఆర్ పురం మండల పరిధిలో ఇలాంటి అక్రమాలు ఎక్కువగా జరుగుతుం డటంతో వీటి వెనుక ఎవరు వున్నారనే ప్రజల్లో చర్చ ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో టన్నుల లోడ్డుతో రోడ్లపై లారీలు వెళ్తుండటంతో ఈ పనులు ఎవరు చేయిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వంలో క్వారీల్లో భారీగా అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు వెల్లువెత్తడంతో ఎన్నికల్లో ఆ ప్రభుత్వంను ప్రజలు ముకుమ్మడిగా కలిసి గద్దె దించారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత ప్రభుత్వం సైతం క్వారీల విషయంపై చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటం, గ్రామీణ ప్రాంతాల్లో లారీల శబ్దాలతో ప్రజలు నిద్రకు దూరం అవుతుండటంతో మళ్ళీ క్వారీల్లో అక్రమాలు ప్రారంభమయ్యాయని ప్రజలు భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఎస్ఆర్ పురం మండల పరిధిలో జరుగుతున్న అక్రమ మైనింగ్ వ్యవహారం వెనుక వున్నది అధికార పార్టీ నాయకులా! లేక రెవెన్యూ, మైనింగ్ అధికారులా! అనే విషయం తేలాల్సి వుంది. ఈ విషయం వీలైనంత త్వరలో తేల్చాలని ప్రజలు ప్రభుత్వంను కోరుతున్నారు.

యోగులు,పీఠాధిపతుల సారధ్యంలో...

తిరుమలకు రామచంద్రయాదవ్ పాదయాత్ర

రామచంద్రయాదవ్

పుంగనూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :తిరుమల ప్రక్షాళన కోసం ధర్మ పరిరక్షణ కోసం బిసివై జాతీయ అధ్యక్షుడు బోడెరామచంద్రయాదవ్ శుక్రవారం నుంచి తిరుమలకు చేపట్టిన పాదయాత్రలో పలువురు యోగులు, పీఠాధిపతులు కలసి నడువనున్నారు. ప్రపంచంలో అత్యున్నత పుణ్యక్షేత్రం,సాక్షాత్తు శ్రీమన్నా రాయణుడు వెలసిన తిరుమలలో జరిగిన అపరాధన పరిహారానికి భారతీయ చైతన్యయువజన పార్టీ అధ్యక్షుడు బోడే రామ చంద్రయాదవ్ పాదయాత్ర ప్రకటించిన విషయం విదితమే. ఈక్రమంలో ఆయనతోపాటూ శ్రీశ్రీశ్రీ రామానుజా చార్య పరంపర శ్రీయదుగిరి యతిరాజ్ మఠాధిపతి శ్రీశ్రీశ్రీ నారాయణ రామానుజ జీయర్ స్వామి,అయోధ్యలోని హనుమాన్ పీఠాధిపతి, శ్రీ మహంత్ కళ్యాణ్‌దాస్‌జీ మహారాజ్, శ్రీపీఠం వ్యవస్థాపకులు,ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు శ్రీపరిపూర్ణానంద స్వామీజీలు పాదయాత్రలో నడువనున్నారు. వీరే కాకుండా శ్రీయాదవ గురుపీఠం కర్ణాటక నుంచి శ్రీకృష్ణ యాదవానంద గురూజీలతో పాటూ కంచి పీఠం నుంచి, శృంగేరాది పీఠాలనుంచి ఉత్తరాధి కారులు, సా స్వామీజీలు ఈ పాదయాత్రలో పాల్గొంటారు. 27న పుంగనూరులోని శ్రీహనుమంతరాయ దిన్నెలో స్వామివారిని దర్శించుకుని కాలినడకన చౌడేల్లి, సోమల, సదుం, పులిచర్ల, శ్రీనివాసమంగా పురంల మీదుగా అలిపిరి నుంచి మెట్ల మార్గంలో తిరుమల చేరుకుంటామన్నారు.తిరుపతి అలిపిరిలో 30వ తేదీ ఉదయం 9 గంటలకు మెట్లోత్సవం నిర్వహించి తిరుమల చేరుకుంటామ న్నారు. హైందవ పరిరక్షణ కోసం చేపడుతున్న ఈకార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ముందు ఏడు ప్రధానమైన డిమాండ్లను ఉంచుతున్నామన్నారు. తిరుమలలో అపరాధాలకు పాల్పడిన వారిపై వందరోజులలో శిక్ష,టిటిడి పాలకమండలి నుంచి పరిపాలనవరకు ప్రక్షాళన చేయాలని, పాలక మండలిలో కార్పొరేట్ శక్తులకు తావివ్వరాదని, విఐపి దర్శనాలు రద్దుచేయాలని, సామాన్యులకు ప్రాధాన్యత ఇవ్వాలని,అన్యమత ఉద్యోగులను తొలగించి వారికి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని, వెయ్యికాళ్ళమండపం తిరిగి నిర్మించాలని, తిరుపతి, తిరుచానూరులలో అలిపిరి, గోవిందరాజస్వామి ఆలయం,తిరుచానూరు, శ్రీకోదండరామాలయాలకు రెండు కిలోమీటర్ల దూరంలో మద్యమాంసాలను నిషేధించాలని, తిరుమలలో గోశాల ఏర్పాటుచేసి స్వంతంగా డెయిరీ ద్వారా సా స్వామివారి ప్రసాదాలకు నెయ్యి తయారుచేసి వినియోగించాలని కోరారు.

సాగరమాల రోడ్డు మట్టి కొరకు తమ్ముళ్లు పోటీ!

కోట,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : సాగరమాల రోడ్లు పనులు కొరకు మట్టిని టిప్పర్లుతో తరలించాలని తెలుగుదేశం పార్టీలోని ఒక వర్గం వారు ప్రయత్నించగా, మరో వర్గం అడ్డకున్న సంఘటన గురువారం కోట మండలం ఉత్తమ నెల్లూరులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తమ నెల్లూరు చెరువులో నుంచి మట్టిని సాగరమాల రొడ్డు నిర్మాణం పనులు కొరకు తెదేపాలోని ఒక వర్గం వారు తరలించేదుకు ప్రయత్నాలు చేశారు. దీంతో తేదేపాలోని మరో వర్గం వారు అక్రమంగా మట్టిని తరలించేందుకు ఒప్పుకునేది లేదని అడ్డుకున్నారు. గ్రామస్థులు కూడా చెరువులో మట్టిని తరలిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. దీంతో మట్టి తోలకం నిలిపేశారు. మండలంలోని ఒక వర్గం వారికే ఇసుక,గ్రావేల్‌ను చెరువుల్లోమట్టి కి అనుమతి ఇస్తూ, మరో వర్గాన్ని నాయకులు దూరంగా పెడుతున్నారని తెలుగు తమ్ముళ్లు కొందరు బహిరంగానే ఆరోపిస్తున్నారు. దీంతో మండలంలో జరుగుతున్న వ్యవహారంపై పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకుని పోతామని కొందరు అంటున్నారు. పార్టీలో మొదటి నుంచి కష్టపడి జెండా మోసిన వారికి విలువు లేకుండా పోతుందని కొందరు తెలుగు తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే

చిత్తూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: చిత్తూరు నియోజకవర్గ పరిధిలో మంచినీటి సమస్య పరిస్కారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 42 మంది ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు దృష్టికి తమ సమస్యలను తెలపగా వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం అనంతరం అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే నియోజకవర్గ పరిధిలో ఎక్కడా మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి సమస్య అధికంగా వున్న ప్రాంతాల్లో కొత్తగా బోర్లు డ్రిల్ చేయాలని, బోర్లు ఎండిపోయిన ప్రాంతాల్లో ట్యాంకర్లు ఏర్పాటు చేసి ప్రజలకు నీరు పుష్కలంగా అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే భూగర్భ జలాలను వృద్ధిలోకి తీసుకురావడానికి చెరువుల్లో పూడిక తీత పనులకు శ్రీకారం చుట్టాలన్నారు.

ఇకపై నెలలో ఒక రోజు డయల్ యువర్ ఎమ్మెల్యే

ఇకపై నెలలో ఒక రోజు డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహిస్తానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ప్రజలు డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించడానికి వారం రోజుల సమయం సరిపోదని, నెలకు ఒకసారి డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించి తాను ప్రజలకు మూడు గంటల పాటు అందుబాటులో వుంటానన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, కమీషనర్ నరసింహప్రసాద్, అసిస్టెంట్ కమీషనర్ ఎ.ప్రసాద్, తహసిల్దారు కళావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరుపతిని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి : ఎమ్మెల్యే

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : ఆధ్యాత్మిక తిరుపతిని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక ఒక ప్రైవేట్ హోటల్‌లో జరిగిన ప్రసూతి శిశువు మరణాల సంరక్షణపై అమెరికాకు చెందిన ట్రైన్ అండ్ హెల్ప్ బేబీస్ ఫౌండేషన్ ముగింపు సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని కబలించిన వేళ మానవాళిని కన్నబిడ్డల కాపాడిన డాక్టర్లు దైవంతో సమానం అన్నారు. నేషన్ మెడికోస్ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి నరేన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ సురేంద్ర బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలలో అమెరికా ఇథియోపియా ఇండియా దేశాలకు చెందిన చిన్న పిల్లల వైద్య రంగ నిపుణులు పాల్గొన్నారు. ఎస్వీ

పరిమళించిన మానవత్వం

– అనాథ మృతదేహాలకు మాజీ సర్పంచ్‌చే అంత్యక్రియలు

కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : మున్సిపల్ పరిధి డికెపల్లి మాజీ సర్పంచ్ డివి సుబ్రమణ్యం మరోమారు తన మానవత్వాన్ని చాటుకున్నారు. వారం రోజుల క్రితం ఇద్దరు మృతి చెందారు. అయితే వీరికి సంబంధించిన వారు ఎవరూ ముందుకు రాకపోవడంతో రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు చొరవతో డికెపల్లి మణి ముందుకు వచ్చి రెండు మృతదేహా లకు అంత్యక్రియల నిర్వహణకు ముందుకు వచ్చారు. గురువారం లాంఛనాలతోఅనాథమృతదేహాలకు అంత్యక్రియలు జరిపారు. డికెపల్లి మణిని పలువురు అభినందించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రామకుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ధి కలిగించడం జరుగుతుందని రాష్ట్ర నేత మునస్వామి, మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి పేర్కొన్నారు. గురువారం వీర్నమల, గట్టూరు తాండా, పెద్ద తాండా, విజలాపురంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు నరసింహులు, పాండియన్, చిన్నికృష్ణ, టివి రవి, కామరాజునాయక్, చంద్రారెడ్డి, బాలరాజు, నవీన్ పాల్గొన్నారు

తెప్పోత్సవంకు భారీ ఏర్పాట్లు

కాణిపాకం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం జరిగే తెప్పోత్సవంకు దేవస్థానం భారీ ఏర్పాట్లు చేపట్టింది. బ్రహ్మోత్సవాలో చివరి ముఖ్యమైన ఉత్సవ రోజు. ఉత్సవాల్లో చివరిరోజు అయిన తెప్పోత్సవంకు అత్యంత ప్రాముఖ్యత వుంది. ఈనేపథ్యంలో ఈతెప్పోత్సవంను అత్యంత ఘనంగా నిర్వహించడానికి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసింది. తెప్పోత్సవంను భక్తులందరూ తిలకించే విధంగా పుష్కరిణి వద్ద బారికేడ్లు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనితో పాటు భక్తులందరికి ఆలయంలో త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు కావలసిన ఏర్పాట్లును అధికారులు చేపట్టారు. తెప్పోత్సవంను అత్యంత ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ తెలిపారు.

కొత్త గొల్లపల్లెలో కొనసాగుతున్న అతిసార ఉధృతి

తవణంపల్లె, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: మండలంలోని నల్లిశెట్టిపల్లె గ్రామపంచాయతీ కొత్తగొల్లపల్లెలో అతిసార ఉధృతి కొనసాగుతోంది. గ్రామంలో కలుషిత త్రాగునీరు సేవించడం వల్ల మంగళవారం నుండి పలువురికి అతిసార వ్యాధి సోకి వాంతులు,విరేచనాలు కావడంతో వివిధ ఆస్పతుల్లో చికిత్స పొందుతున్నారు. ఈమేరకు మంగళవారం ఐదు మందికి అతిసార సోకగా బుధవారం మరో పదిమంది వరకు ఈవ్యాధి సోకింది. అలాగే గురువారం కూడా ఈవ్యాధితో ఎనిమిది మంది ఆస్పత్రి పాలయ్యారు. గ్రామంలో రక్షత మంచినీటి సరఫరా ట్యాంకు ద్వారా సరఫరా అయ్యే త్రాగునీరు కలుషితం కావడం వల్లనే అతిసార వ్యాధి విస్తృతంగా ప్రబలినట్లు తెలుస్తోంది. దీనితో మండల వైద్యాధికారులు డాక్టర్ ప్రయాంక ఆధ్వర్యంలో మంగళవారం నుండి గ్రామంలో ప్రత్యేక వైద్యశిభిరాన్ని ఏర్పాటు చేసి రోగులకు చికిత్సలు అందిస్తున్నారు. కొత్త గొల్లపల్లె గ్రామంలో అతిసార సోకినట్లు తెలియడంతో డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి, జిల్లా టీకాల అధికారి హనుమంతరావు,జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్, జిల్లా ఎపిడమిక్ అధికారి శ్రీవాణి, డీపీఓ లక్ష్మీ చేరుకుని అతిసార నివారణచర్యలు చేపట్టారు. అయినప్పటికి గ్రామంలో అలిసార వ్యాధి ఉధృతి కొనసాగుతుండడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుండె పోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి!

గంగవరం,సెప్టెంబర్ 26, ప్రభాతవార్త : గుండె పోటుతో ఓ హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది.స్థానికుల కథనం మేరకు వివరాలిలా..గంగవరం పంచాయతీ శ్రీనివాస నగర్‌లో నివాసం ఉంటున్న ఈటివి చలపతి(58) గంగవరం రూరల్ సర్కిల్ పరిధిలోని బైరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్ నందు హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.ఈ నేపథ్యంలో బుధవారం చెన్నైలో తమ బందువులు మృతి చెందడంతో సెలవుపై వెళ్ళి అంత్యక్రియలు అనంతరం శ్రీనివాసనగర్‌లోని తన నివాసంలో నిద్రిస్తుండగా హఠాత్తుగా గుండెపోటు రావడంతో ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో చలపతి మృతి చెందాడు.విషయం తెలుసుకున్న వెంటనే గంగవరం రూరల్ సిఐ మురళీమోహన్,పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె పోలీసులు నిఖలర్పించారు.

ముఖ్యమంత్రిని కలిసిన శ్రీనివాసులు నాయుడు

సోమల, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త ఇరికి పెంట మాజీ సర్పంచ్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కర్ణం శ్రీనివాస నాయుడు గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి సమస్యలు విన్నవించాడు. నియోజకవర్గంలో ఎదుర్కొంటున్న సమస్యలు ఆయన తెలి యజేశారు. సోమలలో డిగ్రీ కళాశాల నిర్మాణానికి ముఖ్యమంత్రి అంగీకారం తెలిపినట్లు శ్రీనివాసులు నాయుడు తెలిపారు. ఎద్దప్పరపల్లి డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

వరదరాజస్వామి ఆలయంలో జడ్పీఛైర్మన్

కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : మున్సిపల్ పరిధి లక్ష్మీపురంలోని శ్రీ వరదరాజస్వామి ఆలయంలో జడ్పీఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు తన కుటుంబంతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఆయన జన్మదినం సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా పలువురు నేతలు జడ్పీఛైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈశ్వర్, చీలేపల్లి రవి, శాంతిపురం జడ్పీటిసి శ్రీనివాసులు, కోఆప్షన్ నిసార్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

దళిత నేతలచే భూసమస్య పరిష్కారం

కుప్పంరూరల్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : మండలంలోని దేవరాజపురం గ్రామంలో ఇరువర్గాల మధ్య పదిహేను ఏళ్లుగా నెలకొన్న భూ సమస్యలను దళిత యువజన సేవా సంఘం వ్యవస్థాపకులు కన్నన్, దళిత నేతలు పరిష్కరించారు. ఇరువర్గాల వారితో చర్చించి సమస్యను సానుకూలంగా పరిష్కరించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళిత నేత కందస్వామి, దేశం నేతలు శ్రీనివాసులు, మూర్తి, అన్నాదొరై, కుమార్, సతీష్, శరవణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వందరోజులపాలనలోనే ప్రజాసంక్షేమంకు చొరవ: గౌనివారి

శాంతిపురం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు వంద రోజుల పాలనలోనే ప్రజా సంక్షేమంకు చొరవ చూపారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం రాళ్లబూదుగూరు, కెనమాకుల పల్లి, 64పెద్దూరు, చెంగుబళ్ల పంచాయతీల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు వంద రోజుల్లో చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్, ఎల్.జయరాంరెడ్డి, రమేష్, నాగరాజు, సర్పంచ్ ఎవి జయరాం, చలపతి, చంద్ర, రాజు, శివ, మణి, బసవరాజు, ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆధునిక పంటసాగు విధానాలు తెలుసుకోవాలి

శాంతిపురం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : రైతులు ఆధునిక పంటసాగు విధానాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ఉద్యానవన అధికారి మధుసూధన్‌రెడ్డి సూచించారు. బుధవారం శాంతిపురంలో ఉద్యానవన శాఖ అధ్వర్యంలో రైతులకు బంగాళాదుంపసాగులో మెళకువలు, సస్యరక్షణపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తొలుత నాణ్యమైన విత్తన దుంపలు ఎంచుకోవాలన్నారు. నాటేముందు రెడోమిల్ గోల్డ్‌తో విత్తనశుద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో కోలారు కెవికె శాస్త్రవేత్తలు డా॥ మంజునాథరెడ్డి, డా॥ ఆశ, ఉద్యానవన అధికారులు డింపుప్రియశ్రీ, విండ్య, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, శ్యామలమ్మ, చలపతి, రైతులు పాల్గొన్నారు

మాటతప్పని ప్రజానాయకుడు సిఎం

కుప్పంరూరల్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : ప్రజలకు ఇచ్చిన మాట తప్పని ప్రజా నాయకుడు సిఎం చంద్రబాబునాయుడు అని మాజీ ఎంపిపి సాంబశివ ం, రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి చెక్కునత్తం మణి, జిల్లా నేత రాజగోపాల్ పేర్కొన్నారు. బుధవారం చెక్కునత్తంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామచంద్ర, విఎస్ఎస్ ఛైర్మన్ కనకరాజ్, సర్పంచ్ పెరుమాళ్, ఇఒపిఆర్‌డి విజయదత్, ఎంఇఒ 2 రాజారాం తదితరులు పాల్గొన్నారు.

పోశంవారిపల్లెలో ఇది మంచి ప్రభుత్వం

కల్లూరు,సెప్టెంబరు26 ప్రభాతవార్త : పులిచెర్ల మండలంలోని పోశంవారిపల్లె పంచాయతీలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి స్టీక్కర్లు అంటించారు. ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఎల్లంకివారిపల్లె, దిన్నెపాటివారిపల్లె, విసీ వడ్డిపల్లె, గోపాలపురం, సాగుబడివారిపల్లె తదితర గ్రామాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బాలాజీ, ప్రభాకర్, దాము, గోపినాయుడు, ప్రకాశ్‌నాయుడు, సురేఖ, మోహన్ కార్యకర్తలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ సిఎం చంద్రబాబు

– మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్

కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్ సిఎం చంద్రబాబు నాయుడు అని మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. బంగానత్తంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మల్లానూరులో త్వరలోనే అన్న క్యా ంటీన్ ప్రారంభిస్తా మన్నారు. అధికారులు, నేతలు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేదాకా ప్రజలు నేతలు, అధికారులను వదిలిపెట్టరాదని సూచించారు. అనంతరం ప్రజలనుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ సాయిలహరి, సర్పంచ్ రోహిత్ రవి, ఎంపిటిసి శ్రీనివాసులు, నేతలు రామచంద్ర, రాజగోపాల్, ఈశ్వర్, సతీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జనసేనచే నేడు ప్రాయశ్చిత్త దీక్ష

పుంగనూరు, సెప్టెంబరు 26 ప్రభాతవార్త : పట్టణంలోని శ్రీకళ్యాణ వేంకటరమణ స్వామివారి ఆలయంలో శుక్రవారం ఉదయం ఆరుగంటలనుంచి పదిగంటల వరకు ప్రాయశ్చిత్త దీక్ష నిర్వహిస్తున్నట్లు జనసేన నియోజకవర్గ కన్వీనర్ చిన్నారాయల్ తెలిపారు. కోనేరు వద్ద కళ్యాణ వేంకటరమణస్వామివారి ఆలయంలో స్వామివారి మూర్తికి అభిషేకం ప్రాయశ్చిత్తదీక్ష నిర్వహిస్తామన్నారు.

మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు : చల్లా

సదుం,సెప్టెంబరు 26 ప్రభాతవార్త : మహిళలు అందరు రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం సదుంలోని తహశీల్దారు కార్యాలయం ఆవరణలో ఇది మంచి ప్రభుత్వం–సంక్షోభంలోనూ సంక్షేమం–అభివృద్ధికి రెక్కలు అనే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిదిగా పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని దుర్మార్గపు ప్రభుత్వాన్ని కూలగొట్టి మంచి పని చేశారన్నారు. ఎక్కడ చూసినా అరాచకాలు తప్ప గతంలో ఏమీ జరగలేదని చెప్పారు. అదే విధంగా వచ్చే దీపావళి నుంచి మహిళలకు ఉచితంగా వంట గ్యాస్ సిలెండర్లను పంపిణీ చేయనున్నామన్నారు.ఎంపీడీఓ రాజశేఖర్ బాబు, తహశీల్దార్ షరీఫ్,ఈఓఆర్‌డీ వరప్రసాద్, ఎస్ఐ షేక్‌షావళి, ఏపీఓ శివశంకర్, ఏపీడీ శ్రీనివా సులు, మండల తెలుగుదేశంపార్టీ నాయకులు రెడ్డీప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మహేశ్వరరెడ్డి, నారా యణ, ఈశ్వరరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి,సునీల్‌కుమార్‌రెడ్డి,అమరనాద్, వెంకటరమణారెడ్డి, రాజారెడ్డి, రామచంద్రయ్య, ఈశ్వరయ్య,జనసేన,బాజపానాయకులు భవన్‌కుమార్,ఆనంద్, ఉమామహేశ్వరర రావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పోటెత్తిన వినతులు

కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : కుప్పం మండల కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజలనుంచి వినతులు పోటెత్తాయి. ఉదయం 10గంటలనుంచి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రజలనుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. ప్రధానంగా రెవెన్యూ సమస్యలు, పెన్షన్లు, రేషన్‌కార్డులకు సంబంధించి 117వినతిపత్రాలు అందజేశారు. కుప్పం పట్టణంలో ఉన్న వెంకటరామయ్య చెరువు ఆక్రమణలు తొలగించాలని సామాజిక కార్యకర్తలు వినతిపత్రం అందించారు. అలాగే అమరావతి కాలనీలో మసీదు నిర్మాణంకు స్థలం కేటాయించాలని కోరారు. కుప్పం పట్టణ సమీపంలో రాజుకాలువలు ఆక్రమణలకు గురవుతున్నాయని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మధ్యాహ్నం 2గంటల దాకా కలెక్టర్ ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయా శాఖల వారీగా అందిన ఫిర్యాదులను కేటాయించి త్వరగా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, కమీషనర్ శ్రీనివాసరావు, డిఎస్పీ పార్థసారథి, రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబు, కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టిటిడిచే శ్రీవారి కళ్యాణోత్సవంకు ఏర్పాట్లు

కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : మండలంలోని బేటరాయస్వామి కొండ వద్ద అక్టోబర్ 5న తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)వారిచే నిర్వహించే శ్రీవారి కళ్యాణోత్సవానికి సంబంధించి ఎమ్మెల్సీ, సమన్వ యకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ఆదేశాలతో పటిష్ట ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఎంపిడిఓ సాయిల హరి పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు కర్ణాటక, తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాలనుంచి దాదాపు ముప్పై వేలమందికి పైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమం విజయవంతం చేయాలని ఆమె కోరారు.

గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

– టీడీపీ తిరుపతి జిల్లా కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి

కోట, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమని తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి పేర్కొన్నారు. వంద రోజుల రాష్ట్రప్రభుత్వ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కోటలోని సచివాలయం సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి వివరించారు.లీ సందర్భంగా ప్రజలకు కరపత్రాలను అందజేసి అవగాహన కల్పించారు. దేశంలో ప్రభుత్వం విధించని విధంగా గత వైసీపీ ప్రభుత్వం విధించిన చెత్త పన్నును చంద్రబాబు రద్దు చేశారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం పాలనలో సాగిన ప్రజా వ్యతిరేక పాలన రాక్షస చర్యలకు వ్యతిరేకంగా గత ఎన్నికల్లో వైసీపీకి కనీసం ప్రతిపక్ష స్థానం కూడా దక్కకుండా ప్రజలు తీర్పునిచ్చారని తెలిపారు. రాబోయే ఎన్నికల నాటికి వైసీపీ రాష్ట్ర రాజకీయ క్షేత్రం నుంచి మాయమవడం ఖాయమని రాధాకృష్ణారెడ్డి జోస్యం చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

పెళ్లకూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : పెళ్లకూరు మండలం చిల్లకూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. చిల్లకూరు వద్ద జాతీయ రహదారిపై ముందు నిలిచి ఉన్న లారీని.. శ్రీకాళహస్తి నుంచి వస్తున్న లారీ వెనుక వైపు ఢీకొంది. ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి ముందున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్ కార్తీక్ (23) మృతిచెందగా, లారీడ్రైవర్ వినోద్‌బాబుతో పాటు బీహార్‌కు చెందిన మరో లారీ క్లీనర్ కునాల్‌కుమార్ సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు కార్తీక్ ఎన్టీఆర్ జిల్లా వెంకటాపురానికి చెందిన వాడని పోలీసులు గుర్తించారు. గాయపడిన ఇద్దరిని నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వా సుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య!

కోట,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : కోట మండలం నెల్లూరుపల్లి గ్రామనికి చెందిన శివయ్య (35) అప్పులు బాధలు తట్టుకోలేక ఈ నెల 20 న పురుగుల మందు తాగి ఆసుపత్రి పాలైయ్యారని కోట ఎస్ఐ పవన్‌కుమార్ చెప్పారు. ఈక్రమంలో నెల్లూరులోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారని పేర్కొన్నారు. మృతుడు శివయ్య ఎక్కువ అప్పులు చేయడంతో ఆవీ తీర్చిలేక ఒత్తిళ్ల రావడంతో ఇక చేసేది ఏమి లేక పురుగుల మందు తాగారని చెప్పారు.

పోలేరమ్మ జాతరలో అన్నదానం

వెంకటగిరి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : వెంకటగిరి గ్రామ శక్తి స్వరూపిణి జాతర సందర్భంగా తూర్పువీధిలో సీనియర్ న్యాయవాది టౌన్ క్లబ్ అధ్యక్షులు లక్కమనేని కోటేశ్వరరావు, ఆయన తనయుడు డాక్టర్ సాయిలు భక్తులకు అన్నదానం చేశారు. జాతరకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల కోసం బిర్యానీ పంపిణీ చేసినట్లు న్యాయవాది కోటేశ్వరరావు తెలిపారు. ప్రతి సంవత్సరం భక్తుల కోసం అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. పేదలకు ఆకలి తిర్చడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

వెంకటగిరి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర సందర్భంగా అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సర్వేపల్లి, కోవూరు, దెందులూరు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, చింతమనేని ప్రభాకర్, మాజీ మంత్రి పరసారత్నం, మాజీ ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పి సుబ్బారాయుడు తదితరులు దర్శించుకున్నారు.

బీజేవైఎం గూడూరు ఆధ్వర్యంలో మోగా రక్తదాన శిబిరం

–200 మంది రక్తదానం చేసిన యువత, విద్యార్థులు

గూడూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : భారతీయ జనతా యువమోర్చా గూడూరు ఆధ్వర్యంలో స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో మెగా రక్తదాన శిభిరం నిర్వహించారు. నరేంద్ర మోడీ జన్మదిన వేడుకల్లో భాగంగా మెగా రక్తదాన శిభిరం ఏర్పాటు చేశామని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన కోట సునీల్ కుమార్ తెలిపారు. బిజేపి తిరుపతి జిల్లా అధ్యక్షులు చంద్రప్ప మాట్లాడుతూ రక్తదానం చేయడం మంచిదని, రక్తహీనతతో బాధపడుతున్నటు వంటి పేదలకు ఉపయోగపడేలా చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిజేపి నియోజకవర్గ కన్వీనర్ పురుషోత్తంరెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ గాలి ప్రకాష్ నాయుడు, బీజేవైఎం నగర అధ్యక్షులు శివశంకర్, ప్రధాన కార్యదర్శి బీజేవైఎం కిరణ్ కుమార్ రెడ్డి, ప్రణయ్, కార్తీక్, బాలాజీ, బీజేవైఎం నాయకులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణులకు ఫలసరుకులు పంపిణీ

గూడూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గూడూరు శాఖ ఆధ్వర్యంలో మహాలయ అమావస్యను పురస్కరించుకుని గురువారం గూడూరు బ్రాహ్మణ భవనంలో పేద బ్రాహ్మణులకు ఫల సరుకులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాతలుగా నెల్లూరు ఆలూరు శిరోమకిశర్మ, గూడూరు రిటైర్డ్ పోస్టల్ సూపరింటటెండెంట్ కనుమెల సుబ్బారావు దాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పురుషోత్తం రావు, శ్రీనివాసరావు, కె. వెంకటేశ్వర రావు, వివిఎల్ నరసింహరావు, దువ్వూరు రవీంద్ర నాథ్ రెడ్డి తదితర బ్రాహ్మణులు పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

గూడూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ప్రేరణ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిధిగా పూజా బాలి పాల్గొన్నారు. అంతరం విద్యార్థులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఈ సందర్భంగా కలశాల చైర్మన్ వంకీ పెంచలయ్య మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణలుకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. సులువైన పద్ధతుల్లో క్లిష్టమైన సమస్యలను పరిష్కరించేందుకు నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణు మాధవ్, రాజయ్య, ఏవో రామయ్య, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుతోనే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం

– పిఎంఇజిపి అవగాహన కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

చిత్తూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: జిల్లాలో నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభించాలంటే సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమల స్థాపన జరుగాలని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డిఆర్‌డిఎ సమావేశ హాలులో బుధవారం పిఎంఇజిపి జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావుతో పాటు ఖాదీ, గ్రామీ

మానవతావాది జాషువా

తిరుపతి,సెప్టెంబర్ 26ప్రభాతవార్త: సమాజంలో అంటరానితనానికి అడ్డుకట్ట వేసిన మానవతావాది గుర్రం జాషువా అని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. జాషువా జయంతిన గురువారం ఉదయం ఆయన చిత్రపటానికి రంగస్థలి కళాకారులు పుష్పాంజలి ఘటించారు. మానవత్వాన్ని ప్రబోధించిన మహాకవి జాషువా అన్నారు. ఆయన రచించిన హరిచంద్ర నాటకంలోని పద్యాలు నేటికీ నిరంతరం కళాకారులు ఆలపిస్తున్నార న్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కెఎన్ రాజా, సభ్యులు తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, పుత్తూరు శివప్రసాద్‌రెడ్డి, సురేష్‌స్వామి, బాబు, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గుండె జబ్బులు రాకుండా జాగ్రత్తలు పాటించండి : డాక్టర్ విజయకుమార్

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తిలో గురువారం ' ప్రపంచ హృదయ దినోత్సవం'ను ఫిజిషియన్,గుండె వైద్య నిపుణులు డాక్టర్ పి.విజయకుమార్ సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ఆరోగ్యం కోసం గుండెను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఆయన వివరించారు.ప్రతి ఒక్కరూ 'యంగ్ ఎట్ హార్ట్' కోసం ఆలోచించాలన్నారు. గుండెను జాగ్రత్తగా జబ్బులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రపంచంలోని జపాన్,పారిస్‌లో గుండె జబ్బులు తక్కువగా ఉన్నాయన్నారు. గుండె జబ్బులు కాకుండా ఉండాలంటే సులభంగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలన్నారు. అలవాట్లను అదుపులో పెట్టుకుంటే గుండె సమర్థవంతంగా పని చేస్తుందన్నారు.

కల్లుగీత సొసైటీలకూ మద్యం షాపులను ఇవ్వండి

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :

మద్యం దుకాణాల్లో గౌడ కులస్థులకు పది శాతం రిజర్వేషన్ కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డెప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, నారాలోకేష్‌లకు ధన్యవాదాలు తెలిపారు. అయితే సమాజానికి మేలు జరగాలంటే కల్లుగీత కార్మికుల సొసైటీల తరఫున షాపులను ఇవ్వగల్గితే సొసైటీలో ఉన్న కుటుంబాలన్నీ బాగు పడే అవకాశం ఉందని సంఘం అధ్యక్షుడు పురుషోత్తం గౌడ్ గురువారం తెలిపారు. ఆయనతో పాటు లీగల్ అడ్వయిజరీ కమిటి సభ్యుడు ఉదయగిరి మోహన్ గౌడ్, అధ్యక్షుడు బత్తికృష్ణగౌడ్, సొసైటీ అధ్యక్షుడు కన్నయ్య గౌడ్, ఈశ్వరయ్య గౌడ్, తిరుకాల పురుషోత్తం గౌడ్‌లు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో రష్యా భక్తుల ధ్యానం

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :

దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి అతిథుల తాకిడి పెరుగుతుంది. భారత దేశంలోని నలుమూలల్లోనే కాకుండా ప్రపంచ దేశాల నుంచి కూడా భక్తులు భక్తి భావంతో స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. ఆ నేపథ్యంలో గురువారం రష్యాకు చెందిన 45 మంది భక్తులు స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. ఆలయ నిర్మాణాలను చూసిన రష్యావాసులు విస్తుపోయారు. వారు బైఠాయించి యోగా,ధ్యానం చేసారు. తరువాత స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఇసుక రవాణాను ఆపండి...స్వర్ణముఖిని కాపాడండి

శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :

జీవనది,పరమ పవిత్రమైన స్వర్ణముఖి నదిలో ఇసుకను అక్రమంగా తరలించటంతో రాళ్ళు తేలిపోయిందని ఇసుక అక్రమ రవాణాను ఆపి స్వర్ణముఖి పవిత్రను నదిని కాపాడాలని సిపిఐ డిమాండ్ చేసింది. శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని పుల్లారెడ్డి గ్రామం నుంచి ఇసుకను యధేచ్ఛగా తరలిస్తున్నారని ధ్వజమెత్తారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి కొమ్ముకాస్తున్న మైనింగ్,సెబ్ అధికారులను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేసారు. 'ట్రెంచ్ వివాదం' చోటు చేసుకున్న పుల్లారెడ్డి వద్ద సిపిఐ నాయకులు గురువారం పర్యటించి పరిశీలించారు. జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ అధికార పార్టీ ముసుగులో విచ్చల విడిగా ఇసుకను దోచేస్తున్నారని ధ్వజమెత్తారు.ఇసుకను తోడేయటంతో నది తన ఉనికిని కొల్పోతుందని ధ్వజమెత్తారు. కలెక్టర్ స్పందించాలని డిమాండ్ చేసారు.ఈ మేరకు నియోజకవర్గ నాయకుడు జనమాల గురవయ్య, మించల శివకుమార్,రోడ్డ గోపి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో వెలుగు సమాఖ్య రికార్డుల పరిశీలన

తొట్టంబేడు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:

వెలుగులో అవినీతి చీకట్లుపై విచారణ కొనసాగుతోంది. చియ్యవరం పంచాయతీలో విచారణ పూర్తయిన తర్వాత గురువారం నుంచి గుండేలిగుం, చోడవరం, కాసరంలో ప్రారంభమయ్యాయి. గుండేలిగుంట పంచాయతీలో వెలుగు సమాఖ్య రికార్డులను పరిశీలించేందుకు ఇద్దరు అధికారులను నియమించగా ఈ పంచాయతీలో 33 సంఘాలు, 346మంది సభ్యులు ఉన్నారు. ఇక చోడవరం పంచాయితీలో 32 సంఘాలు ఉండగా గురువారం 12సంఘాలకు చెందిన రికార్డులను విచారణాధికారి గరటారెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఇక్కడి పంచాయతీకి ముగ్గురు అధికారులను నియమించారు. సమగ్ర విచారణ పూర్తయిన తర్వాత నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు.

ఫార్మసిస్ట్‌లకు సన్మానం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :

ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఫార్మసిస్ట్ చేసిన అమూల్యమైన సహకారాన్ని గుర్తించి ఫార్మసిస్ట్‌లను సన్మానించిన శ్రీకాళహస్తి పట్టణంలోని కొత్తపేటలోని శ్రీరాం కళ్యాణ మండపంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఫార్మసిస్టు దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి తిరుపతి జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి రాము, శ్రీకాళహస్తి అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూధనరావు, కార్యదర్శి గోపాల్, ట్రెజరర్ కార్తీక్‌రెడ్డి, సీనియర్ ఫార్మసిస్ట్ అమరా జనార్ధన్, ఆనంద్‌గుప్తా, అసోసియేషన్ కమిటీ సభ్యులుతో పాటు పట్టణంలోని అని మందుల దుకాణాల ఫార్మసిస్టులు హజరయ్యారు. కార్యక్రమంలో సీనియర్ ఫార్మసిస్ట్ అమరాజనార్ధన్, ఆనంద్ గుప్తా, అసోసియేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జోరుగా బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :

దేశం కోసం ధర్మం కోసం అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం బిజెపి సభ్యత్వాన్ని ప్రతి ఒక్కరు తీసుకోవాలని రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్‌కుమార్ తెలిపారు. పార్టీ సభ్యత్వనమోదులో భాగంగా గురువారం బిజెపి నేతలందరు కలసికట్టుగా సభ్యత్వాలు నమోదు చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, కోలా గోవర్ధన్, పట్టణ అధ్యక్షులు గరికపాటి రమేష్‌బాబు, హరీష్, బిందుకుమార్, సిద్దు, త్రివిక్రం, సమంత, చందు, నాని తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలును సందర్శించిన అదనపు జిల్లా జడ్జి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :

పట్టణంలోని కొత్తపేటలో ఉన్న సబ్‌జైలును గురువారం 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్‌నాయక్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క రిమాండ్ ఖైదీలకు తప్పక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఏసమస్య వచ్చినా ఒక అర్జీరూపంలో ఇస్తే సమస్యను పరిష్కరిస్తామన్నారు.

వేమూరు వ్యవసాయక్షేత్రంలో శాస్త్రవేత్తలు

తిరుపతి రూరల్ వేమూరులోని అయ్యప్పనాయుడు వ్యవసాయక్షేత్రంలో శాస్త్రవేత్తలు ఔషధమొక్కలు పరిశీలించారు. ఇక్కడ కషాయాలు తయారుచేసే విధానం గమనించారు. ఈ వ్యవసాయక్షేత్రం ఏ గ్రేడ్ సాధించింది.

ప్రభాతవార్త-తిరుపతి

పిళ్లారిపట్టులో ఉచిత డెంటల్ క్యాంపు

పుత్తూరురూరల్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త: పుత్తూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం తిరుపతి శ్రీసాయి డెంటల్ క్లినిక్ వారు పిళ్లారిపట్టు మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత డెంటల్ క్యాంపు నిర్వహించారు. కళాశాలలోని సుమారు 400 మంది విద్యార్థులు, 50 మంది స్టాఫ్ ఈ క్యాంపులో పాల్గొని దంత పరీక్షలు చేయించుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.కుమార్ తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సాగులో ఉన్న లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేయాలి

బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 26 ప్రభాతవార్త: 20 సంవత్సరాలుగా వ్యవసాయ సాగులో ఉన్న వీఎస్ పురం దళితులకు పట్టాలు మంజూరు చేయాలని గురువారం సీపీఐ నాయకుడు కత్తి ధర్మయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ ఐ.సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన పేదవారు కొంచెం ఆర్థికంగా బలపడాలని ఉద్దేశంతో నాటి నుంచి నేటి వరకు భూములను పేదలకు పంచడం జరిగింది.కానీ దీనికి విరుద్ధంగా దళితులు సాగులో ఉన్న భూములకు పట్టాలు చేయాలంటే సంబంధిత శాఖ అధికారులు వెనుకంజ వేస్తున్నారు. కాటూరు రెవెన్యూలోని సర్వే నెం.340లో 34 ఎకరాల 60 సెంట్లు భూమిని గత 20 సంవత్సరాలుగా వీఎస్ పురం గ్రామానికి చెందిన దళితులు వ్యవసాయ సాగు చేసుకుంటున్నారు. ఈ భూమిపై ఆధారపడి 70 కుటుంబాల వారు జీవనోపాధి పొందుతున్నారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు స్పందించి సాగులో ఉన్న వీఎస్ పురం దళితులకు పట్టాలు మంజూరు చేయకుంటే ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని విన్నవించారు. కార్యక్రమంలోసీపీఐనాయకులుకత్తిరవి,కృష్ణయ్య, మునెమ్మ, వెంకట రమణయ్య, అంకయ్య పాల్గొన్నారు.

ఆదర్శంగా కూటమి ప్రభుత్వం

విజయపురం, సెప్టెంబరు 26 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం ఆదర్శంగా ఉందని మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు పేర్కొన్నారు. గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక టీడీపీ నాయకులతో అధికారులు వంద రోజుల్లో టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను పెంచిన పింఛన్ల కరపత్రాలను, స్టిక్కర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు కపిల్, శామువేలు, చిన్నబ్బరాజు, శివలింగం, బాబు, శరత్, బెంజిమన్, పెరుమాళ్, దొరైరాజ్, లక్ష్మయ్య, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిష్ట్రసార్ మోహన్‌బాబు బదిలీ

చంద్రగిరి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్ కె.మోహన్‌బాబు నగరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీపై వెళ్ళారు. సాధారణ బదిలీలలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో సబ్ రిజిస్ట్రార్ మోహన్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ దినేష్ నగరికి బదిలీ అయ్యారు. శ్రీకాళహస్తిలో సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కొండారెడ్డి ఇక్కడికి బదిలీపై రానున్నారు. సబ్ రిజిస్ట్రార్ బదిలీ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్స్ డి.ఎస్.వై. అధ్యక్షుడు సి.ఎం.కేశవులు రైటర్స్ దుశ్శాలువలు, పుష్పగుచ్ఛాలతో ఘన సన్మానం చేసి వీడ్కోలు పలికారు.

కార్మికులకు వైద్య పరీక్షలు, పిపిఈ కిట్లు

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : నగర పరిశుభ్రతకు అహర్నిశలు పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి, వారి ఆరోగ్య పరిరక్షణకు ఎల్లప్పుడూ సహకరిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాల్లో భాగంగా గురఉవారం ఇందోర్ స్టేడియంలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు, పిపిఈ కిట్లను ఎమ్మెల్యే, కమిషనర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరం పరిశుభ్రంగా ఉందంటే కారణం పారిశుద్ధ్య కార్మికుల నిరంతరం కృషి అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీహరి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విరివిగా వ్యవసాయ రుణాలు

చంద్రగిరి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: రైతులకు విరివిగా రుణాలు అందిస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ (ఎస్‌బిఐ ఏడిబి) బ్యాంక్ మేనేజర్ దామోదర్ తెలిపారు. ఈ మేరకు గురువారం బ్యాంక్‌లో రైతులకు రుణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వెటర్నరీ వైద్యులు డాక్టర్ వంశీ, తిరుపతి ఎస్‌బిఐ ఛీఫ్ మేనేజర్ ఇందిరాప్రియదర్శిని మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖకు సంబంధించి వివిధ పథకాల ద్వారా రైతులకు బ్యాంకులు అందించే రుణాలను వివరించారు. అదేవిధంగా ఇందిరాప్రియదర్శిని మాట్లాడుతూ వ్యవసాయ రుణ పథకాలు గోల్డ్ లోన్స్, క్రాప్ లోన్స్, ఆవులపై లోన్లు, ఫౌల్ట్రీ, గొర్రెలు, ఇతర రునముల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌టిఓ రాజరాజేశ్వరి, చిత్తూరు రీజినల్ అగ్రి రిలేషన్‌షిప్ మేనేజర్ వినయ్, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఉలవలు పంపిణీ

వెదురుకుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: మండలంలోని పెరుమాళ్ పల్లి సచివాలయంలో టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జ్ మోహన్‌మురళి గురువారం రైతులకు రాయితీపై ఉలవలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న ఉలవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో టిడిపి మండల అధ్యక్షుడు లోకనాథరెడ్డి, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, వెంకటాద్రి నాయుడు, చెన్నకేశవరెడ్డి, తిరుమల రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చి వాహనంపై శ్రీ సీతారామలక్ష్మణులు

చంద్రగిరి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారామలక్ష్మణ హనుమంత సమేతులు బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను దర్శనమిచ్చారు. సాయంత్రం శ్రీ సీతారామలక్ష్మణ హనుమంత స్వాముల వారి ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు శ్రీ సీతా లక్ష్మణ సమేత హనుమంతులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపీనాథ్, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్‌బాబు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, దివిమురళి కృష్ణమాచార్యులు, గోపాల్ భట్టాచార్యులు, సంతాన కృష్ణన్, డాక్టర్ ఇల్లందు లక్ష్మీ రాజేష్, నల్లురి విష్ణుమూర్తి, మంకు చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అవసరమైన సేవలు

-నేరాలనియంత్రణకు పటిష్ట నిఘా -తిరుమల 2టౌన్ సిఐ శ్రీరాముడు

తిరుమల, సెప్టెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల పుణ్యక్షేత్రంలో భక్తులకు అవసరమైన సేవలందిస్తామని, వారి భద్రతకు చర్యలు తీసుకుంటామని తిరుమల 2టౌన్ సిఐ శ్రీరాముడు తెలిపారు. నేరాలనియంత్రణకు పటిష్ట ప్రణాళికలతో పనిచేస్తామన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ గురువారంఉదయం తిరుమల 2టౌన్ సిఐగా ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం మర్యాదపూర్వకంగా తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ,డిఎస్పీ విజయశేఖర్‌ను కలిశారు.

సరిగమప సీజన్ 16 దినెక్ట్‌సింగింగ్

తిరుపతి,సెప్టెంబర్ 26ప్రభాతవార్త:

విలక్షణమైన ఫిక్షన్,నాన్‌ఫిక్షన్, సూపర్‌హిట్ సినిమాలతో అంతులేని వినోదం అందిస్తున్న జీ తెలుగు పాపులర్‌షో సరిగమప సరికొత్త సీజన్‌తో వచ్చేసింది. మట్టిలోని మాణిక్యాలను వెలికితీస్తూ అత్యంత ప్రేక్షకాదరణతో విజయవంతంగా 15 సీజన్లు పూర్తిచేసుకుని 16వ ది నెక్ట్స్‌సింగింగ్ యూత్ ఐకాన్ 29వతేదీ సాయంత్రం 6గంటలకు ప్రారంభమవు తుందని ప్రతినిధి ప్రసాద్‌గుప్త తెలిపారు. అక్టోబర్ 6వతేదీ నుండి ప్రతి ఆదివారం రాత్రి 9గంటలకు జీ తెలుగులో ప్రసారమవుతుంది. తెలుగురాష్ట్రాలతో బాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన గాయనీగాయకులకు ప్రోత్సహించే లక్ష్యంతో డ్యాన్సింగ్, సింగింగ్ షోలతో ముందుకు వచ్చింది. ఈ 16వ సీజన్‌కు ఎనర్జిటిక్ వ్యాఖ్యాతగా యాంకర్ శ్రీముఖి వ్యవహరిస్తున్నారు. జీ తెలుగు చీఫ్ కంటెంట్ అధికారి అనురాధ గూడూరు యువ అసాధారణ ప్రతిభా వంతులకు ఎల్లప్పుడూ స్వాగతం ఉంటుందన్నారు

తిరుపతి డివిజన్

మునిసిపల్ కమిషనర్‌కు టిఎన్‌టియుసి సన్మానం

పుత్తూరు, సెప్టెంబరు 26 ప్రభాతవార్త : పుత్తూరు మునిసిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మంజునాథ్ గౌడ్‌కు టిఎన్‌టియుసి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు నేతృత్వంలో గురువారం సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి విక్రయదారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులివ్వాలని, పట్టణంలో మంచినీటి వసతి, సులభ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరారు. అలాగే ఆటో కార్మికులకు ఆటో స్టాండ్ సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ ఛైర్మన్ బి.ఆర్.యుగంధర్, నాయకులు కృష్ణంరాజు, చీరల మోహన్, కన్నన్, జయచంద్ర, పూల సుధ, మార్కెట్ రాజా తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి ప్రతిరూపం ఎన్‌సిసి

పుత్తూరు, సెప్టెంబరు 26 ప్రభాతవార్త :

నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సిసి) విద్యార్థులకు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, దేశభక్తి అలవడతాయని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కోటేశ్వరయ్య తెలిపారు. గురువారం ఎన్‌సిసిలో ప్రవేశం పొందిన 34 మంది విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సిసిలో శిక్షణ పొందడం వల్ల సామాజిక సేవ, జాతీయత భావం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ఎన్‌సిసి శిక్షణ పొందిన వారికి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, సిఆర్‌పిఎఫ్, బిఎస్‌ఎఫ్ వంటి శాఖల్లో ప్రాధాన్యత వుంటుందన్నారు. పోటీ పరీక్షల్లో కూడా రిజర్వేషన్ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి కెప్టెన్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు, 29 ఆంధ్రా బెటాలియన్ తిరుపతికి చెందిన సుబేదార్ బిమల్ మింజ్, హవల్దార్ శివరాజ్, తెలుగు అధ్యాపకుడు పి.వెంకటేశన్, పలువురు ఎన్‌సిసి విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

థార్ రాక్స్ కార్ గ్రాండ్ లాంచింగ్

తిరుపతి విద్య,సెప్టెంబర్ 26,ప్రభాతవార్త: స్థానిక రేణిగుంట రోడ్డులో ఉన్నా మహేంద్ర షో రూమ్ లో బుదవారం మహేంద్ర అండ్ బాలాజీ ఏజెన్సీ అండ్ ఇండస్ట్రీస్ వారు థార్ రాక్స్ కార్ గ్రాండ్ గా లాంఛ చేసారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సతీష్ నాయుడు టిడిపి పార్లమెంటు ఉపాధ్యక్షుడు.వెంకీ ఎస్ ఐ కళ్యాణ్ డ్యామ్,విజయ్ కుమార్ ఎస్సై కళ్యాణ్ డ్యామ్,పార్థ సారధి రిటైర్డ్ మేజిస్ట్రేట్,పతాంజలి రవి,సీఈఓ కిరణ్మయి మాట్లాడుతూ బాలాజీ ఏజెన్సీస్ అండ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో థార్ రాక్స్ గ్రాండ్ లాంచ్ చేయడం జరిగిందని అన్నారు. మహీంద్రా మొదటి దాని రకమైన ఏకైక ఆర్ ఓ ఎక్స్ ఎక్స్ కోసం చాలా మంది ఎదురు చుశారు అని,ఇప్పుడు అడ్రినలిన్ రష్ కోసం పాజ్ చేద్దాం అండ్ బీస్ట్,ది బాస్ ఆఫ్ బాస్స్ బాప్ ఆఫ్ ఆల్ బాప్‌లను ఆవిష్కరించినందుకు సంతోషిద్దా అని అన్నారు.మాసూల్ అండ్ ఆటోమెటిక్ లో లభించును అని,ఇందులో 7 విభిన్న రంగులు కలవు అని అన్నారు

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యత.

-అసోసియేట్ డీన్ జగపతి రామయ్య

తిరుపతి విద్య,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: పశు వైద్య కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. పర్యావరణ రక్షణ లక్ష్యంగా పశువైద్య కళాశాలలో గురువారం చెత్తను,ప్లాస్టిక్ ను తొలగించామని. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యత అని అసోసియేట్ డీన్ జగపతి రామయ్య తెలిపారు.స్వచ్ఛతాహీ సేవ లో భాగంగా కళాశాలలో 80 కిలోల చెత్తను,ప్లాస్టిక్ ను పశువైద్య కళాశాల ఆవరణము నుండి తొలగించామని,అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఎన్‌ఎస్‌ఎస్ వాలంటరీస్ మన సేవలను అందించడంతో పాటు పర్యావరణ నరిరక్షణ ఆవశ్యకతను తెలియజేస్తూ విద్యార్థిని,విద్యార్థులు ర్యాలీగా టౌన్ ఆసుపత్రి నుండి తుడా కార్యాలయం వరకు ప్రజలకు పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు భాధ్యతగ తీసుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీనివాసరావు,డాక్టర్ అమరావతి,డాక్టర్ రాజా,డాక్టర్ వెంకటేశ్వర్లు, కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో రైతుల అభివృద్ధికి ప్రాధాన్యత

కేవీబీ పురం, సెప్టెంబరు 26 ప్రభాతవార్త: భూసార పరీక్షలు నిర్వహించి పంటలు చేయాలని వ్యవసాయ అధికారి మురళీకృష్ణకుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎస్ఎల్ పురం ఎస్టీ కాలనీ, కళత్తూరు గ్రామ పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం లోభాగంగాగ్రామసభ నిర్వహించి రైతులకు సూచనలు ఇచ్చారు. రైతులు నూతన వంగడాలను ఎంపిక చేసుకుని ఎలాంటి పంటలు చేయాలని, యంత్రాలతో మందులు ఎలా వినియోగించాలి వంటి విధానాలను వివరించారు. ప్రభుత్వ పథకాలను తెలియజేసి తక్కువ పెట్టుబడిలో అధిక ఉత్పత్తి, ఎక్కువ

నాణ్యతతో రూపుదిద్దుకొంటున్న వకుళమాత ఆలయ రోడ్డు

-వేగవంతంగా వకుళమాత, మంగాపురం రోడ్డు పనులు -సంక్రాంతికి పూర్తి కానున్న రోడ్లు : సి.ఎం చంద్రబాబుచే ప్రారంభం

తిరుపతిరూరల్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: చెర్లోపల్లి కూడలి నుండి వకుళమాత ఆలయరోడ్డు, చెర్లోపల్లి నుండి మంగాపురం వరకు నిర్మితమౌతున్న రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.21కోట్ల రుపాయాలతో చెర్లోపల్లి కూడలి నుండి జాతీయ రహదారి (వకుళమాత ఆలయం) వరకు నూతన రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న విషయం తెల్సిందే. తిరుపతి 150 బైపాస్ రోడ్డు శ్రీవకుళమాత ఆలయ సమీపం నుండి చెర్లోపల్లి కూడలి వరకు 70శాతం రోడ్డు పనులు పూర్తయ్యాయి. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన 39మంది రైతులకు ప్రభుత్వం టిడిఆర్ బాండ్‌లు ఇవ్వాల్సి ఉంది. టిడిఆర్ బాండ్స్ పంపిణీలో జాప్యం జరగడం రోడ్డు పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. గురువారం చెర్లోపల్లి కూడలి వద్ద జరుగుతున్న డైవర్షన్ పనులను అధికారులు పర్యవేక్షించారు. అలాగే రూ.17కోట్ల రుపాయాలతో చెర్లోపల్లి కూడలి నుండి మంగాపురం వరకు రోడ్డు పనులు వేగవంతం జరుగుతున్నాయి. ఫారెస్ట్, విద్యుత్ శాఖ క్లియరెన్స్ జాప్యంతో చెర్లోపల్లి-మంగాపురం రోడ్డు నిర్మాణ పనులలో జాప్యం జరుగుతుంది. విద్యుత్, ఫారెస్ట్ శాఖ క్లియరెన్స్ వస్తే త్వరితగతిన రోడ్ల పనులు పూర్తి కానున్నాయి. చెర్లోపల్లి -150 బైపాస్ రోడ్డు, చెర్లోపల్లి- మంగాపురం రోడ్ల పనులు జనవరికి పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ శుభగిరి తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులలో ఎక్కడాఆ రాజీ పడకుండా నూతన రోడ్లు నాణ్యత ప్రమాణాలతో రూపుదిద్దుకోనున్నాయి. సంక్రాంతికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నూతన రోడ్లను ప్రారంభించనున్నారని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- పరిశుభ్రతలో ప్రపంచంతో పోటీ - స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

చిత్తూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రతలో ప్రపంచంతో పోటీ పడి ప్రధాని నరేంద్రమోడి ఆశయ సాధనకు నడుంబిగించాలని ఆయన చెప్పారు. చిత్తూరు మున్సిపల్ పార్కుకు సమీపంలోని రిలయన్స్ మార్ట్, గిరింపేటలోని మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఆఫైర్స్ అండ్ స్పోర్ట్స్, నెహ్రూ యువకేంద్ర సంఘతన్, చిత్తూరు వారి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవా' 'మేరా యువ భారత్' కార్యక్రమానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడుతో కలిసి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ మహాత్మాగాంధీ స్ఫూర్తితో ప్రధాని నరేంద్రమోడి మదిలో నుండి ఆవిర్భవించిన సామాజిక కార్యక్రమమే స్వచ్ఛ భారత్ అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, తెలుగుదేశం నాయకులు గీర్వాణీ చంద్రప్రకాష్, కార్పొరేటర్ ఆశోక్, బిజెపి నాయకులు చిట్టిబాబు, జగదీష్‌నాయుడు, మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఆఫైర్స్ అండ్ స్పోర్ట్స్, నెహ్రూ యువకేంద్ర సంఘతన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌బికెఆర్‌లో న్యాక్ బృందం పరిశీలన పూర్తి

కోట, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలకు నాలుగవ సారి న్యాక్ అక్రడేషన్‌లో భాగంగా న్యాక్ ఫేర్ కమిటీ విచ్చేసి కళాశాల లోని వివిధ విభాగాలను పరిశీలించిందని కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి తెలియజేశారు. ఈ నెల 24, 25వ తేదీలలో న్యాక్ ఫేర్ కమిటీ విచ్చేసి సమగ్రమైన నివేదికను నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడియేషన్ కౌన్సిల్ బెంగళూరు వారికి అందజేశారని తెలిపారు. ఈ నెల 24, 25 తేదీలలో న్యాక్ కమిటీ ఛైర్మన్‌గా కాలడి కేరళ వైస్ ఛాన్సలర్ శ్రీ శంకరాచార్య యూనివర్శిటీకి చెందిన డాక్టర్ ఎంసి దిలీప్‌కుమార్, బాబాసాహెబ్ బీమ్‌రావ్ అంబేద్కర్ యూనివర్శిటీ మెంబర్ ప్రొఫెసర్ డాక్టర్ రైస్‌ఖాన్ కోఆర్డినేటర్‌గా, శ్రీ గురుబుద్ధ స్వామి మహావిద్యాలయ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజ్‌కుమార్, మహారాష్ట్ర మెంబర్ పర్చాని ఎన్‌బికెఆర్‌కు విచ్చేసి కళాశాలలో ఉన్న ల్యాబొరేటరీస్, లైబ్రరీ, కంప్యూటర్ సెంటర్, స్పోర్ట్స్ క్లబ్, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ ఉమన్ ఎంపోర్‌మెంట్, ప్లేస్‌మెంట్ సెల్, బొటానికల్ గార్డెన్‌లను సందర్శించారు. ఫ్యాకల్టీ, పూర్వ విద్యార్థులు, పేరెంట్స్, స్టుడెంట్స్‌తో విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. రెండురోజుల పాటు కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కమిటీ వారితో కళాశాల అభివృద్ధి గురించి చర్చించారని తెలిపారు. కమిటీ వారికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని కళాశాల సిబ్బందిని ఆదేశించగా, కమిటీ విజయవంతంగా వారి పరిశీలన చేసేందుకు తోడ్పడింది. బోధన బోధనేతర సిబ్బంది కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభినందించారు.

భక్తి శ్రద్ధలతో జుంలేపీర్ షా వలి అల్లాహ్ ఉరుసు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : పట్టణంలోని స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన హజరత్ సయ్యద్‌షా జుంలేషా పీర్ చిష్టియల్ ఖాదరీ వలీ అల్లా ఉరుసు వార్షిక గంధోత్సవం గురువారం సిజరేకే ఫాతేహా జెండా నిషానాతో శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాలకు స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జలరిషితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భక్తిశ్రద్ధలతో వల్లి అల్లా దర్గాకు చాదర్‌లు, పూలచాదర్‌లు సమర్పించారు. ఆమెకు దర్గా మర్యాదలతో ముజావర్‌లు సయ్యద్‌అహ్మద్, బాబాఫరీద్ వారి కుటుంబసభ్యులు స్వాగతం పలికారు. 30 ఏళ్ల క్రితం శ్రీకాళహస్తిలోని జుంలేషా పీర్ బాబా దర్గా ఉరుసు అంటే జిల్లాలోనే కాక పొరుగు రాష్ట్రాల్లో కూడా ప్రసిద్ధి చెందింది.

గంధోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

గంధోత్సవానికి ఏర్పాట్లును నిర్వాహకులు పూర్తిచేశారు. గురువారం దర్గా వద్ద జెండా ప్రతిష్ట కార్యక్రమాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. 27న సాయంత్రం గంధోత్సవాన్ని పురవీధుల్లో మెరవణి కార్యక్రమాన్ని అంగరంగ వైభంగా నిర్వహించుటకు ఏర్పాట్లు చేపట్టారు.ఇక్కడ ఉరుసు మహోత్సవాన్ని నిర్వహించుటకు ప్రత్యేక కమిటిని ఏర్పాటు చేసారు.28న గజల్ శ్రీనివాస్‌చే ఉర్దూ మరియు తెలుగుగజల్ కార్యక్రమాలతో పాటు ముంబైకు చెందిన ఖవ్వాలి పాట కచ్చేరి నిష్టాతులు బాద్‌షా, దిల్‌షాద్‌లచే ఖవ్వాలి పాట కచ్చేరి ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కమిటి పగ్గాలను దర్గా ముజావర్ సయ్యద్ అహ్మద్ వారి సొదరులు పట్టణానికి చెందిన ప్రముఖ ఆర్యవైశ్య సంఘానికి చెందిన ఓరుగంటి నాగేశ్వరరావు, ఆర్గనైజర్స్‌గా గుమళ్ళ రాజేశ్వరరావులకు అప్పగించటం ఇక్కడ మత సామరస్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

గురువుకు విశేష పూజలు అభిషేకాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన గురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు, హోమాలు, అభిషేకాలు ఆలయ ప్రదానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వెలసిన సత్యసాయి బాబా ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో నీరాజనాలు సమర్పించారు. ఈ సేవల్లో పాల్గొన్న భక్తులు భక్తి పారవశ్యంతో పునీతులయ్యామని భావించారు. ఉదయం ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో గురుదక్షిణామూర్తి ఆలయం ఎదుట కలశస్థాపన గావించారు. వేద మంత్రాల మధ్య స్వామి వారికి 108 దీపాల పర్వత హారతి, చక్రహారతి, కుంభ హారతి మహామంగళ హారతులిచ్చారు. ఈ కార్యక్రమాల్లో డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్, సుదర్శనం నాయుడు, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్ పర్యవేక్షించారు. స్థానిక భక్తులు విశేష సంఖ్య హాజరైనారు. పూజలు, అభిషేకాలను ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ సారధ్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ సి.ఐగా కుచ్చల శ్రీనివాసులు ఈ గురువారం సాయంత్రం బాధ్యతలు తీసుకున్నారు. ప్రభాతవార్త, తిరుపతి

అభివృద్ధి సంక్షేమ కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే పాశం

గూడూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని బానిగి సాహెబ్ పేటలో ఇది మంచి ప్రభుత్వం, ప్రజా పరిష్కార వేదిక సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకువెళ్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌ను పెంచి ఒకటవ తేదీనే ఇంటింటికి చెరవేస్తున్న ఘనత చంద్రబాబుకే సాధ్యం అన్నారు. పేద వాడ ఆకలి నింపే అన్న క్యాంటీన్‌లను ప్రారంభించడం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తున్నామన్నారు. టిడిపి హయంలోనే గూడూరు పట్టణాభివృద్ధి జరిగిందన్నారు. ఇది ప్రజల ప్రభుత్వం అని, ప్రజలే పాలకులు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శీలం కిరణ్ కుమూర్, పులిమి శ్రీనివాసులు, నెలబల్లి భాస్కర్ రెడ్డి, వాటంబేడు శివకుమార్, మట్టం శ్రావణి రెడ్డి, రవీందర్ రెడ్డి, పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో నేడు (శుక్రవారం)

పగలు : అభిషేకం : రాత్రి : తెప్పోత్సవం

ఉభయదారులు : కీ॥శే॥ శ్రీ గాలి పుండరీకనాయుడు, కాకర్లవారిపల్లె, కీ॥శే॥ శ్రీ.ఆర్.శేషాద్రినాయుడు అండ్ బ్రదర్స్, కాకర్లవారిపల్లె, కీ॥శే॥ జి.హనుమంత నాయుడు వారి కుమారులు, అడపగుండ్లపల్లె, కీ॥శే॥ యం.రామకృష్ణారెడ్డి గారి కుమారుడు ఎం.జగన్నాధరెడ్డి, కాణిపాకం, చినకాంపల్లె, కీ॥శే॥ గురుజాల దామోదరనాయుడు, కొత్తపల్లె, కీ॥శే॥ చల్లగుండ్ల దామోదరనాయుడు వారి కుమారులు, కాకర్లవారిపల్లె, శ్రీగురుజాల ఆనందనాయుడు అండ్ బ్రదర్స్ దిగువ మారేడుపల్లె, శ్రీలంకిపల్లె మోహన్‌బాబు, బొమ్మసముద్రం.

స్థానిక ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు: ఉదయం 10 గంటల నుండి అర్ధరాత్రి వరకు పలు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ కళాకారులచే భక్తిసంగీతం, హరికథలు, కూచిపూడి, భరతనాట్యం, పౌరాణిక నాటక ప్రదర్శన, కోలాటాలు, చెక్కభజనలు, లంబాడి నృత్యాలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కాణిపాకం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసిన పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. గురువారం పూలంగిసేవ సందర్భంగా స్థానిక ఆస్థాన మండపంలో దేవస్థానం, ఉభయదారుల సయుక్త ఆధ్వర్యంలో భారీ ఎత్తున రాష్ట్రంలోని ప్రముఖ కళాకారులచే ఉదయం నుండి రాత్రి వరకు పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈమేరకు హరికథలు, భక్తిగీతాలు, కూచిపూడి, భరతనాట్యం, పౌరాణిక నాటక ప్రదర్శనలు, కోలాటాలు, చెక్క భజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమాలు ఆహుతులను ఎంతో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సురభి నాటక ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి.

రైల్వే స్టేషన్‌లో బాత్రూమ్‌లను వినియోగంలోకి తేవాలి : సిపిఐ

పుత్తూరు, సెప్టెంబరు 26 ప్రభాతవార్త : పుత్తూరు రైల్వేస్టేషన్‌లో నిర్మాణం జరిగి వృధాగా పడి వున్న బాత్రూమ్‌లను ప్రజల సౌకర్యార్థం వినియోగంలోకి తీసుకురావాలని సిపిఐ నాయకులు గురువారం రైల్వే స్టేషన్ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ పుత్తూరు మండల కార్యదర్శి డి.మహేష్ మాట్లాడుతూ స్టేషన్‌లో ప్లాట్‌ఫారంలపై చాలా ఏళ్ల క్రితం బాత్రూమ్‌లు నిర్మించినప్పటికీ వాటిని వినియోగించడం లేదన్నారు. రైళ్లు ఆలస్యమైనపుడు బాత్రూమ్ సౌకర్యం లేక ప్రయాణీకులు, ముఖ్యంగా మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్న మాటలకు వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని ఆరోపించారు. అలాగే ప్లాట్‌ఫారంలపై మంచినీటి సౌకర్యం కూడా లేదని, వున్న కుళాయిలు నామమాత్రంగా వున్నాయని తెలిపారు. దీనిపై స్టేషన్ మాస్టర్ మాట్లాడుతూ మౌలిక సదుపాయాలకు సంబంధించి కాంట్రాక్టు ఇవ్వలేదని, త్వరలోనే కాంట్రాక్టు ఇచ్చి ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎఐటియుసి మండల కార్యదర్శి గోపి, సిపిఐ నాయకులు రాజేష్, భాస్కర్, కాశి తదితరులున్నారు.

బ్రహ్మోత్సవాల బందోబస్తుపై రైల్వే పోలీసుల ప్రణాళికలు

రేణిగుంట, సెప్టెంబరు 26 ప్రభాతవార్త: శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుపతి రైల్వే పోలీసులు బందోబస్తు విషయంలో జాగ్రత్తలపై గురువారం చర్చించారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ మధుసూదన్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్పీఎఫ్, జీఆర్పీ అధికారులు పాల్గొన్నారు. వీరంతా శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చించారు. ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీటీవీలో ఏర్పాటు చేయడం, ప్రయాణికులకు శ్రీవారి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. శ్రీవారి భక్తుల సౌకర్యం కోసం అనుక్షణం ప్రకటనలు చేయడం, భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా జాగ్రత్తలు తీసుకోవడం, రైల్వే ఆస్తులకు నష్టం కలగకుండా ప్లాట్‌ఫారాలపై రైల్వేస్టేషన్ ప్రాంగణంలో పోలీసు పహారా ఏర్పాటు చేయడం, బాంబ్ స్క్వాడ్ టీముతో విస్తృత తనిఖీలు చేయడం, భక్తులకు అత్యవసర వైద్య సహాయం అందించడం, తప్పని సరిగా స్థానిక వైద్యులతో సంప్రదించి వైద్య కేంద్రాలు ఏర్పాటు చేయడం తదితర అంశాలపై నిర్దిష్టమైన నిర్ణయం తీసుకున్నారు. రద్దీ నివారణ కోసం బార్కెట్ల, ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయడం, లాంటి అంశాలు చర్చకు వచ్చాయి.

28న భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాక

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డా. ధనంజయ వై.చంద్రచూడ్ ఈ నెల 28,29వ తేదీల్లో తిరుపతి జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ గురువారం తెలిపారు. గౌరవ భారత ప్రధాన న్యాయమూర్తి 28న శనివారం సాయంత్రం 5.30 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకొని రాత్రి బస చేసి మరుసటి దినం సెప్టెంబర్ 29న ఆదివారం ఉదయం 8.15 గంటలకు తిరుమల చేరుకుని, తిరుమల శ్రీ వారిని దర్శించుకొని తిరుమల నుండి బయలుదేరి తిరుపతి చేరుకొని స్వల్ప విశ్రాంతి అనంతరం మధ్యాహ్నం 2.35 గంటలకు తిరుపతి విమానాశ్రయం నుంచి తిరుగు ప్రయాణం కానున్నారని కలెక్టర్ తెలిపారు.

ఉత్సాహంగా సాగిన 3కె రన్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : స్వచ్ఛరతహి సేవ కార్యక్రమంలో భాగంగా తిరుపతి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం 3కె రన్ ఉల్లాసంగా ఉత్సాహంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్. మౌర్యలు వివేకానంద కూడలి వద్ద జెండా ఊపి ప్రారంభించారు. వివేకనంద కూడలి నుండి ప్రారంభమై టౌన్ క్లబ్, బాలాజీ కాలనీ మీదుగా ఎస్‌వి యూనివర్శిటీ వరకు ఈ 3 కె రన్ పరుగు పందెంలో పెద్ద ఎత్తున యువకులు, విద్యార్థులు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కోసం స్వచ్ఛత హి సేవలో భాగంగా గత పది రోజులుగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. స్వచ్ఛ భారత్ ప్రధాని నరేంద్ర మోడి ప్రవేశపెట్టిన గొప్ప పథకం అన్నారు. వ్యక్తిగత శుభ్రత ఎంత ముఖ్యమో ఇల్లు, పరిసరాల పరిశుభ్రత ఎంత ముఖ్యమో ఇల్లు, పరిసరాల పరిశుభ్రత అంతే ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, సెట్విన్ సిఈవో మురళీకృష్ణ, స్పోర్ట్స్ కాంప్లెక్స్ మేనేజర్ సయ్యద్, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మొదటి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

వడమాలపేట, సెప్టెంబరు 26 ప్రభాతవార్త: ప్రజా సమస్యలు పరిష్కారం అభివృద్ధి పనులకు ఆర్థిక ప్రాధాన్యతనిస్తున్నట్లు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వంద రోజులు పూర్తయి సందర్భంగా గురువారం మండలంలోని ఓబీఆర్ కండ్రిగ గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అత్యధిక మెజారిటీ వచ్చినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా మా ఇంటి రావచ్చునని, మా ఇంటి తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయన్నారు. మండలానికి రెండు కోట్ల రూపాయల ఉపాధిహామీ పథకం నిధులు మంజూరు కాగా ఆ నిధులను సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువలు, తాగునీటి పథకాలకు ఖర్చు చేసినట్లుగా తెలిపారు. అంగన్‌వాడీ టీచర్స్ తయారు చేసిన పౌష్టికాహారం స్టాల్స్‌ను పరిశీలించారు. చిన్నారులకు అన్న ప్రాసన చేశారు. ఈ సందర్భంగా రామరాజు కండ్రిగ గ్రామస్తులు శ్మశనానికి స్థలం చూపాలని కోరగా పరిశీలించి న్యాయం చేయాలని తహసీల్దార్ జరీనాను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తి, తహసీల్దార్ జరీనా, సీడీపీవో పద్మజ, ఏపీఎం మునికృష్ణారెడ్డి, ఏవో విజయకుమార్, ఏఈ భాస్కర్‌రాజు, సర్పంచ్ శ్రీవిద్య, జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, నాయకులు ధనంజయలునాయుడు, వెంకటేశ్వర రావు, హేమావతి, శ్రావణ్, భాస్కర్‌రాజు, ఆదినారాయణ, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్ టు ఆర్ట్ ప్రదర్శనలకు విశేష స్పందన

తిరుపతి కార్పొరేషన్, సెప్టంబర్ 26 ప్రభాతవార్త : నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేస్ట్ టు ఆర్ట్, వెస్ట్ టు వండర్ పోటీలకు విశేష స్పందన లభించింది. స్థానిక కచ్చపి ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొని పనికిరాని వాటితో తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ మౌర్య మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలు నిర్వహించామన్నారు. వేస్ట్ తగ్గించాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమం నిర్వహించామని అన్నారు. చెత్తను వేరుచేసి తమ సిబ్బందికి ఇస్తే వాటిని రిసైకిల్ చేసేందుకు వీలుంటుందని అన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు పూర్తిగా తగ్గించాలన్నారు. పిల్లలు ఎంతో వేస్ట్‌తో ఉపయోగకరమైన వస్తువులు తయారు చేయడం అబ్బుర పరిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డిఈ విజయకుమార్, మహేష్, రాజు, సంజయకుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి, మస్తాన్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి కొత్త కమిషనర్ గిరి బాధ్యతలు స్వీకరణ

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా బి.యస్.గిరి గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఆయన మొదట శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. తరువాత మున్సిపల్ కార్యాలయంలో సుమూహూర్తంలో బాధ్యతలను స్వీకరించారు. గతంలో మాచర్ల కమిషనర్‌గా పని చేసిన గిరి కొంత కాలంగా డిఎంఏ కార్యాలయంలో ఉంటున్నారు. వివిధ సామాజిక అంశాలను పరిగణలోకి తీసుకున్న శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి గిరికి అవకాశం కల్పించారు.

పుణ్యక్షేత్రంలో పని చేయటం అదృష్టం:

శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.యస్ గిరి మాట్లాడుతూ శ్రీకాళహస్తి లాంటి పుణ్యక్షేత్రంలో పని చేయటం తన పూర్వ జన్మ సుకృతమని అదృష్టమన్నారు. తాను ఇక్కడ పదవికి కొత్త అలాగే సిబ్బంది కూడా అందరూ కొత్తవారే కాబట్టి ప్రజలు సహకరించాలని కమిషనర్ బి.యస్.గిరి కోరారు.కొత్త కమిషనర్‌కు డిఇఇ లలిత, టౌన్ ప్లానింగ్ అధికారి మధుసూధన సిబ్బంది స్వాగతం పలికారు. బాధ్యతలను ఇన్‌చార్జిగా నిర్వహించిన లలిత కొత్త కమిషనర్ గిరికి అప్పగించారు.